# భీతహారిణి

రచన :
శ్రీ కె. పి. బాబు

(గత సంచిక తరువాయి)

'అసలే కోతి, అందులో కల్లు తాగింది; ఆపైన తేలు కుట్టింది; ఇక చూసుకోండి దాని గంతులు అన్నట్లయింది. ఆయన ప్రవర్తన-నా విషయంలో... నేను ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు తన స్నేహితులెవరినో నా దగ్గరకు పంపించి, నా శీలాన్ని పరీక్ష చేయబోయే వారాయన. నేను అలా వచ్చిన వారికి లొంగక, చీవాట్లు పెట్టి పంపుతూ వుంటే-తానాశించినట్లు జరగనందుకు ఉక్రోషంతో వచ్చి మరింత కుళ్ళ బొడిచేవారాయన నన్ను. ఆ విధంగా నన్ను ఎన్నాళ్లు, ఎన్ని చిత్రహింసలు పాల్జేశారో ఆ భగవంతుడికే తెలియాలి! మీరేమన్నా అనుకోండిగాని, ఆయన నా ఉసురు తగిలే చచ్చిపోయాడు; విధవరికం అబ్బితే అబ్బిందిగాని - నాకిప్పుడే యింత సుఖం, శాంతిగా వుంటుందనుకోండి!!...' అంది శాంతమ్మ.

నేనామె చివరి మాటలకు చకితుణ్నయ్యాను. ఒక భారత స్త్రీ ఆ విధంగా మనసులోనైనా అనుకుంటుందని అంతకాలం నేను కలలోనయినా భావించి వుండలేదు. అందువల్ల, ఆమె పొందిన బాధలెంతటివై వుంటవో యోచిస్తూ కూర్చున్నాను.

శాంతమ్మ కొన్నిక్షణాలాగి, మళ్ళీ చెప్పసాగింది. 'అలా కొన్నాళ్ళు గడిచాయి. రోజురోజుకీ ఆయన హింస పెరగడమే తప్ప తగ్గే సూచన లేమాత్రం కనిపించలేదు. ఇక నేనక్కడవుండి ఎంతోకాలం బ్రతకలేననిపించింది. అందుకని, ఒకనాడు గుట్టు చప్పుడు కాకుండా - కట్టుబట్టలతో నేను మా పుట్టింటికి పారిపోయాను. అది తెలిసి ఆయన పెద్దగొడవ చేశాడు. మావాళ్లు మళ్ళీ నన్ను ఆయనవద్దకు పంపాలనుకున్నారు. కాని, నన్ను ఆయనదగ్గరకు పంపడం అంటే యముని వద్దకు తోలడమేననీ, అలా చేయడమే జరిగితే, ఏదో ఒకరకంగా నా ప్రాణాలను నేనే తీసుకుంటాననీ నేను మావాళ్ళతో గట్టిగా చెప్పేశాను. మావాళ్ళు ఆచూకీ తీయగా, చాలామంది ఆయన్నిగురించి నేను చెప్పినదంతా నిజమేనని తెలియజేశారు. దానితో యిక మావాళ్ళు నన్ను ఆయనవద్దకు పంపలేదు. ఆయన అప్పుడప్పుడూ మావాళ్ళమీద విరుచుకు పడుతూనే వుండేవాడు. నేనామధ్యలో మెల్లగా మావాళ్ళని ఒప్పించి, హయ్యర్ గ్రేడ్ టీచర్ ట్రైనింగై, నేను ఎవరికీ బరువు భారం కాకుండా నా కాళ్ళమీద నేను జీవించే స్థితికి వచ్చాను...' అని ఆగింది శాంతమ్మ.

నేనింకో సిగరెట్ ముట్టించి, పొగ మేఘాలను సృష్టించ సాగాను-ముఖం పైకెత్తి నా మౌనాన్ని సహించలేనట్లుగా ఆమె నావంక చూస్తూ, నాగురించి తెలుసుకోవాలని యింత కుతూహల పడ్డారు - దేనికి?' అనడిగింది.

అందుకూ నేనేమీ జవాబివ్వలేక పోయాను.

'ఏం, కథగాని రాస్తారా నా గురించి - కొంపదీసి?' అంది మళ్ళి శాంతమ్మ నవ్వుతూ.

అంత బాధకరమైన స్థితినుండి అంతలోనే ఎలా తేరుకుని, ఆమె అలా నవ్వగలుగుతూందో అర్థంకాక నేను మెల్లగా ఆమె వైపుకు ముఖం త్రిప్పి చూచాను. 'ఏం, అలా చూస్తున్నారు? నాది కథగా రాయడానికి పనికి రాదా మీకు?' అంది మళ్ళీ ఆమె బిక్క ముఖంతో.

నాకప్పుడు నవ్వొచ్చింది. రచయిత అయినవాడికి యితరుల కష్టసుఖాల గురించి తెలుసుకోవాలనే కౌతుకం ఉండడం సహజం. అలాగని తనకు తెలిసిన ప్రతి ఒక్కరి చరిత్రనీ కథగా ఏ రచయితా రాయడు; రాయలేడు! ఎవరో కొందరి అనుభవాలు మాత్రమే రచయితలకు ఉపయోగపడతాయి; అదైనా కొంతవరకే!' అంటూ లేచాను, భానుమూర్తి యింటికి పడుకోవడానికి పోవాలని.

శాంతమ్మ కూడా లేస్తూ, 'ఇంతకీ నాది కథగా రాయడానికి మీకు పనికిరాదంటారు?' అంది.

'నే నలా అనలేదే! ఆలోచించాలి...' అని క్రిందికి వెళ్ళిపోయాను, తిరిగి చూడకుండా.

కెనెడియన్ ఇంజన్‌లా పెళ్ళిరోజు వచ్చేసింది... పెళ్ళి జరిగింది సుగుణ ఇంట్లో. ఆ రోజు ఆ ఇల్లు అది వారం సాయంకాలపు మెరీనా బీచ్‌ని గుర్తుకు తెచ్చింది. ఎంతమంది బంధు - మిత్రులు! ...ఏం కోలాహలం!!... చాలా కాలానికి అంతటి సంతోష సంరంభ పూరితమైన శుభకార్యాన్ని చూడ్డం సంభవించింది. అందుకని, కళ్యాణ మండపం బాగా కనిపించే ఒకమూల ఒంటరిగా చేరి, సిగిరెట్ కాలుస్తూ - వివాహ కార్యకలాపాలను చూస్తూ, మనసారా ఆనందిస్తూ కూర్చున్నాను.

'ఓ-మీరిక్కడున్నారా?' అంటూ శాంతమ్మ ఎక్కడ నుండో వచ్చి, నా ఏకాంతాన్ని భగ్నం చేసింది.

నేను మందహాసం చేసి, ఊరుకున్నాను.

'అదేంటండీ, అందరూ అక్కడచేరి ఆనందిస్తూ వుంటే, మీరొక్కరూ ఈ మూల కూర్చున్నారేమిటి?' అంది ఆశ్చర్యంగా.

'ఇటువంటివాటిని ఒంటరిగాచూస్తేనే నే నెక్కువ ఆనందిస్తాను; అందుకనే ఈ మూల చేరాను' అన్నాను.

'చిత్రంగా వుందే!' అందామె మరింత విచిత్రంగా కళ్ళు త్రిప్పుతూ.

'చిత్రమేముంది? ఒక్కొక్కరికి ఒక్కొక్క అలవాటు వుండడం సహజమేగా!' బీచ్‌లో గుంపులుగా, కనీసం జంటలుగా చేరి-కాలక్షేపం చేయడం కొందరికి యిష్టం. సముద్రానికి దగ్గరగా, యిసుకలో-ఏకాంతంగా కూర్చుని, అలల పోటీలనూ-ఆకాశపు వింతలనూ చూడ్డం నాబోటివారికి యిష్టం; ఏం చెప్పేదింక?' అన్నాను, మరో సిగిరెట్ ముట్టిస్తూ.

తనకు నామాటలేమీ అర్థం కానట్లు చూచి, 'ఏమోనండీ, మీరంతా వింతగా మాట్లాడ్తారు. అదిసరేగాని, ఏరీ మీవాళ్ళు? ఏరోజుకారోజు అడగాలనుకునీ మరిచి పోతూవచ్చాను. ఇవాళ ఎలాగూ కనిపిస్తారుగదా అనుకున్నాను-ఏరండీ?' అంది శాంతమ్మ.

'ఎవరండీ?' అన్నాను, తెల్లబోతూ.

'అయ్యో రామ! ఎవరేమిటండీ, మీ అర్ధాంగిగారండీ! ఎక్కడ?' అందామె నవ్వుతూ.

హఠాత్తుగా నా గుండెల్లో గునపంతో పొడిచినట్లయింది. కొన్నిక్షణాలు మౌనం వహించి, 'నాకు పెళ్లయిందని మీ కెవరు చెప్పారు?' అన్నాను నెమ్మదిగా.

శాంతమ్మ ముఖం వెలవెలబోయింది. ముప్పై ఏళ్ళున్నట్లు కనిపించే నా ఇరవై ఆరేళ్ళ ఆకారాన్ని అమాయకంగా ఎగాదిగాచూస్తూ, 'నాకెవరూ చెప్పలేదు; నేనెవరినీ అడగనూలేదు. మీకు పెళ్ళయ్యే వుంటుందనుకున్నానంతే! ఇంతకీ మీకు పెళ్ళే కాలేదాండి-నిజంగా?' అంది.

'నిజంగానే, నాకింకా పెళ్ళి కాలేదండీ!' అన్నాను నేను జీవరహితంగా నవ్వి.

'ఒట్టు?' అంటూ ఆమె చట్టున తనచేతిని నాముందుకు చాచింది. కాని, నేనామె ఆశించినట్లు ఆ చేతిలో నా చెయ్యి వెయ్యలేకపోయాను, అలాగే కూర్చుని, సిగిరెట్ కాలుస్తూ, 'మాటమీదనే నమ్మకముంచడం అలవాటు చేసుకోండి. అది లేకపోయినప్పుడింకేమిచేసినా లాభం వుండదు!' అన్నాను గంభీరంగా,

శాంతమ్మ కొంచెం చిన్నబుచ్చుకుని, 'పోన్లెండి గాని, మీరెందుకింకా పెళ్ళిచేసుకోలేదు?' అనడిగింది.

ఆశనీ, ఆత్రాన్నీ మిళితం చేసిన ఆమె చూపులనుండి నా ముఖాన్ని చాటు చేసి-అవతల కళ్యాణ మండపంలో జరుగుతున్న వివాహ కార్య కలాపాన్ని చూస్తూ, 'అదంతా ఒక మహాభారత మంత గాధ!' అన్నాను.

ఆమె కూడా నేను చూచే వేపే చూస్తూ, 'అట్లాగా! అయితే, అదంతా ఇంకెప్పుడన్నా-తీరిగ్గా వున్నప్పుడు వింటాను లెండి గాని, ఇప్పుడు క్లుప్తంగా చెప్పండి' అంది - వదిలిపెట్టనన్నట్లు.

'క్లుప్తంగా చెప్పాలంటే-నేనొకామెను పెళ్ళి చేసుకోవాలనుకున్నాను. ఆమె నా అర్ధాంగి అయితే, నేనెంతైనా సుఖిస్తాననుకున్నాను. కాని, ఆమే 'నేను నీకు తగను' అని నా కోరిక తోసిపుచ్చి-నాకు దూరమై పోయింది...అప్పటి నుంచీ నా పెళ్ళి విషయంలో నేనంత శ్రద్ధాసక్తులు చూపడం లేదు...' అన్నాను నేను నిట్టూర్చి.

శాంతమ్మ నా ముఖంలోకి ముఖంపెట్టి చూచింది. ఆమె కళ్ళల్లో అప్పుడు ఎక్కడలేని జాలీ ఉట్టిపడింది. 'అయ్యో - పాపం!' అంది చాలా సానుభూతిగా, ఇంకా

ఏదో చెప్పాలనుకుంది. కాని, అంతలో ఎవరో అటు రావడం గమనించి, 'మళ్ళీ వస్తానండీ!' అంటూనే నా దగ్గరనుండి వెళ్ళిపోయింది.

* * *

శాంతమ్మ గురించి ఏమీ తెలియనివారు ఆమెను చూస్తే - 'వాసన చూడబడనట్టి ప్రసూనం' అని పొరబడి తీరుతారు. అంత యిదిగా వుండేవి ఆమె వేషభాషలూ - విగ్రహమూ! ఒంపు సొంపుల బిగి సడలని శరీరం; తీరని కోరికలూ - తీవ్రమైన తృష్ణా ప్రతిఫలింపజేసే విశాలమైవ నేత్రాలు; నునుపుదేరిన చెక్కిల్లు; మాటమాటకూ మందహాస మొలికించే మధురాధరాలు; కత్తిలాంటి ముక్కు; బలిష్టమైన మెడ; ఉన్నతమైన స్తనద్వయం; సన్నని నడుం'...తోటి స్త్రీలకు ఈర్ష్య కలిగించేవి; ఎటువంటి మగవాడికైనా - మరొక్కసారి చూడాలనిపించేవి!!...అటువంటి శాంతమ్మ. దాంపత్య సుఖమెరుగక పోగా, అష్ట కష్టాలూ అనుభవించినదనీ; చివరికి విధవైనదనీ తెలుసుకున్న తరువాత - ఆ పెళ్ళికి వచ్చిన వారిలో ప్రతి పురుషుని దృష్టీ ఆమెపైనే కేంద్రీకరించబడిందంటే వింతేమీ అనిపించలేదు - నాకు.

శాంతమ్మ ఎంత ఛలాకీగా వుండేదో - అంత కలుపుగోరుతనంతో తిరిగేది ఎవరితోనైనా. ఆమెకి కొత్తా పాతా అనే తేడా లేనట్లే - మంచీ చెడ్డా భేదమూ లేదేమో ననిపించేటంత విపరీతంగానూ మసిలేవి ఒక్కొసారి. కాని, అందరూ ఆమెలాంటి వారుండరుగదా? అందులో - మగవాళ్ళు!! ఆమె ప్రతి ఒక్కరితో నవ్వుతూ మాట్లాడేది; రాసుకు పూసుకు తిరిగేది, అది కొందరు పురుష పుంగవులలో కామవాంఛలను రేకెత్తించడం; ఆ సంగతి పసిగట్టిన మరుక్షణం నుంచే ఆమె విపరీతమైన భయాందోళనలతో అట్టివారికి దూరంగా వుంటూ - లోలోన బాధపడడం తరుచుగా సంభవించేది. అనేక సార్లు అటువంటి సంఘటనలను గురించి నాతో ఆమె మనసు విప్పి చెప్పుకుని దుఃఖించేది. ఆమెనెలా ఓదార్చాలో నాకు బోధపడేది కాదు. ఆమె కాబాధ శాశ్వతంగా తొలిగే మార్గమేదన్నా ఆలోచించాలనుకునే వాణ్ణి...

సుగుణకి పెళ్ళయిన నాటి రాత్రే గర్భాదానం జరిగింది...వాళ్ళింట్లో మేడమీద ఒక గదిని అందుకని ఎంతో చక్కగా అలంకరించాం...ఆ సమయంలో శాంతమ్మ ముఖంలో దాచాలనుకుంటున్నా దాగకుండా వెలికి ప్రసరించిన విషాద చ్ఛాయలను నేను పసిగట్టుక పోలేదు. తన గతస్మృతులను నెమరుకు వచ్చి ఆ సమయంలో ఆమె లోలోన ఎంతో ఆవేదన ననుభవిస్తోందనుకున్నాను.

ఆ రాత్రి...శోభన ముహూర్త సమయానికి ఇంటిల్లపాసి మేడమీదకు చేరారు. వివాహితులు తమతమ గతాను భవాలను గుర్తుకు తెచ్చుకుంటూ పులకితులవుతూ వుంటే, ఇంకా పెళ్ళికాని యువతీ యువకులు తమకు కలగ బొయ్యే ఆ మదురాను భూతిని ఊహించుకుంటూ ఉర్రూత లూగుతుంటే, పిల్లలు అదంతా ఒక వినోదంగా భావించి కేరింతలు కొట్తున్నారు. ఆ సందర్భంలో శాంతమ్మ ముఖ కవళిక లెలా గుంటవో పరికించాలనే కుతూహలంతో నేను ఆమెకోసం అటూ ఇటూ చూచాను. కాని, ఆమె మేడమీద ఎక్కడా కనిపించలేదు. గబగబా క్రిందికి వెళ్ళాను.

మూల గదిలో కిటికీ దగ్గర ఒక కుర్చీలో కూర్చుని శాంతమ్మ, వినీలాకాశంలో మెరుస్తున్న నక్షత్రాలను తదేకంగా చూస్తోంది. నేను చడీ చప్పుడు కాకుండా మెల్లగా వెళ్ళి, ఆ కుర్చీ వెనుక నిలబడ్డాను. ఆ గదిలోనే కాదు - ఆ చుట్టు ప్రక్కల కూడా ఎవరూ లేరాసమయంలో. మేడమీదకోలాహలం క్షణక్షణానికీ ఎక్కువవుతోంది...వెన్నెలకూడా క్రమేణా అధికమాతూ కొంచెం కిటికీలోంచి శాంతమ్మ ఒళ్ళోకి పడసాగింది...అమృతాంజనం వాసన ఘాటుగా తగిలింది. నాకా మెదగ్గరకు పోగానే, భారంగా నిట్టూర్చడమూ వినిపించింది. తలనొప్పిగా వుందని చెప్పి అలా క్రిందికి వచ్చేసి అక్కడే కూర్చున్నా ఆమె అసలు బాధేమిటో అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ జేబులో నుండి నశ్యం పెట్టి తీసి, ఒక పట్టు ఎగబీల్చాను. ఆశబ్దానికి శాంతమ్మ ఉలిక్కిపడి, వెనుదిరిగి చూచింది.

'ఓ—మీరా! ఎప్పుడొచ్చారిక్కడికి? అంది కంగారుగా లేస్తూ.

'ఇప్పుడే వచ్చాన్లెండి గాని, కూర్చోండీ - మరేం పర్వాలేదు' అన్నాను నేను తాపీగా.

'ఉండండి' అంటూనే వెళ్ళి - దీపం వెలిగించి వచ్చింది.

'నేనొకటి అడుగుతాను జవాబు చెప్తారూ?' అందరూ పైనచేరి ఆనందిస్తుంటే - మీరీమూల చేరారెందుకు?' అనడిగాను, ఆమె ముఖంలోకి చూస్తూ.

'నా ప్రశ్నతో ఆమె ముఖం మరింత విషణ్ణమైంది. 'ఏం లేదండీ! తలపోటుగా వుంటే—' అని, అర్థోక్తితోనే ఆగిపోయింది.

'మీరబద్ధమాడ్తున్నారు. నాకైనా నిజం చెప్పరా?' అన్నాను జాలిగా చూస్తూ.

ఆమె ఒకసారి నా కళ్ళలోకి చూచి, ఆవెంటనే తలొంచేసుకున్నది. 'ఏం చెప్పేది బాబుగారూ! కొందరాడవాళ్ళకి నాలాంటి వెధవది అటువంటి శుభకార్య సందర్భంలో అక్కడుండడం గిట్టినట్లులేదు; మరికొందరు మొగాళ్ళకి అటువంటి సమయాల్లో నాబోటిదాన్ని చూస్తుంటే మరీ పిచ్చెక్కినట్లవుతుంది; ఇంకేవిధంగా నేనా ఆనందాన్ని అనుభవించేది? నా అంత దౌర్భాగ్యురాలింకొకతె వుండదనుకుంటాను...'అని, వెక్కి వెక్కి ఏడవనారంభించింది.

నేనిక సహించలేకపోయాను. మెల్లగా దగ్గరకు వెళ్ళి, ఆమె గడ్డం పట్టుకుని-ముఖం పైకెత్తి, 'అవును గాని, మీరెందుకు మళ్ళీ పెళ్ళి చేసుకోకూడదు?' అన్నాను మృదువుగా.

శాంతమ్మ నా చేతిని తొలిగించక, అలాగే నా ముఖంలోకి చూస్తూ, 'మీరెందుకు చేసుకోరు?' అనడిగింది ఎదురు.

'నేనా? ఎందుకు చేసుకోనూ? నాకవసరమనుకున్న మనిషి నన్ను చేసుకోలేదు. కనుక, నేనవసరమనుకున్న వారెవరన్నా కనిపిస్తే-వారిని చేసుకోవాలనే నిశ్చయానికి వచ్చివున్నాను - తెలుసా?' అన్నాను గంభీరంగా.

'మీరు మగవారు. మీకేంజరిగినా బాధవుండదు; మీరేంచేసినా బాగానే వుంటుంది. కాని—' అని ఆగిపోయిందామె.

'ఏమిటో పూర్తిగా చెప్తే, జవాబివ్వడానికి ప్రయత్నిస్తాను' అన్నాను వెంటనే.

'అదికాదండీ! ఇప్పుడు నేను మనసు మార్చుకుని, ఎవరో మీలాంటివారిని పెళ్ళిచేసుకుంటానే అనుకోండి; ఒక స్నేహితురాలిగా నాపట్ల మీరింతవరకూ చూపుతూ వచ్చిన ప్రేమానురాగాలూ, గౌరవాభిమానాలూ భార్యపైన తరువాత కూడా చూపగలరని నమ్మకమేమిటి?' అంది తడబడుతూ శాంతమ్మ.

నాకు నవ్వొచ్చింది, మీ రెంత అమాయకులో యిప్పుడు బాగా తేలిపోయింది. ఏ దురదృష్టాన్నో మీరొక దుర్మార్గుడికి భార్యకావడం-కొన్ని కష్టనష్టాలనుభవించడం జరిగింది. అందుకని అందరు మగాళ్ళని దుష్టులనుకోవడం ఎంతమాత్రం సబబుకాదు. పెళ్ళికి ముందుకంటే, అదైన వెనుక ఇంకా ఎంతో ఎక్కువగా ప్రేమించినవారిని నేనెరుగుదును...' అంటూ, ఆమెను మరింత దగ్గరకు తీసుకుని-లాలించబోయాను.

నేనలా చేయబోతున్నంతలోనే శాంతమ్మ కళ్లు భయంతో కదుల్లాడాయి; పెదవులు చలించాయి; నిలువునా ఆమె కంపించిపోయింది! తన శక్తినంతా కూడదీసుకుని, నానుండి వేరైపోయి - 'క్షమించండి బాబుగారూ! నన్నింకా ఆలోచించుకో నివ్వండి...' అంటూనే ఆ గదిలో నుండి గబగబా వెళ్ళిపోయిందవతలకు...

ఆ సంఘటన నన్ను తలక్రిందులు చేసేసింది ఆ రాత్రి నాకు నిద్రలేదు. ఎంత ఆలోచించినా, ఎన్ని సిగరెట్లు కాల్చినా, ఎంత పొడుం పీల్చినా నాకు శాంతమ్మ మనస్తత్వం సరిగ్గా బోధపడలేదు...ఏమైనా ఇక విజయవాడనుంచి మకాం ఎత్తేలనిపించింది. అయితే ఎక్కడికి వెళ్లాలి అన్నది తేలలేదు. మర్నాటి ఉదయం కాఫీత్రాగి, అలా బజారులోకి పోయాను-అదే ఆలోచిస్తూ...

బజార్లో నా బాల్యస్నేహితుడొకడు అప్రయత్నంగా కనిపించాడు. మేమిద్దరం కలుసుకుని చాలకాలమవుతుంది. ఒకరినొకరం పరామర్శించుకోవడంలో-'నేనిప్పుడిక్కడే ఒక తీర్థయాత్రా ట్రావెల్ సర్వీస్‌లో మానేజర్‌గా పని చేస్తున్నా'నన్నాడు. 'ఇవాళే మా ఉత్తర

(తరువాయి 19వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)

హిందూస్థానయాత్ర ప్రారంభం. స్పెషల్ ట్రెయిన్ స్టేషన్ కొచ్చివుంది. ఈ సాయంకాలమే బయల్దేరుతున్నాం,' అని కూడా చెప్పాడు వాడు.

'అలాగా! నన్నూ రమ్మంటావా నీవెంట. నీవు తోడుగా వున్నట్టూ వుంటుంది, నేను దేశం చూచినట్లూ వుంటుంది' అన్నాను నవ్వుతూ.

'అంతకంటేనా? వేళాకోళం కాదు - నిజంగా వస్తావా, తీసుకెళ్తాను' అన్నాడు వాడు.

ఎక్కడికి వెళ్ళాలి అనే నా సమస్య యిట్టే విడిపోయినట్లయింది. 'అలాగే-తప్పక వస్తా'నని వాడికి చెప్పి, భానుమూర్తి ఇంటికి దారి తీశాను.

* * *

ఇటు భానుమూర్తి - అతని తల్లిదండ్రులూ, అటు సుగుణా-ఆమె తల్లీ తండ్రీ, ఇంకా కొందరు మిత్రులూ- ఎవరెంత బాధ పడినా, బలవంతం చేసినా- నేను వారందరికీ మళ్ళీ అటువంటి సదవకాశం నాకు కలగదని నచ్చచెప్పి, ఆనాటి సాయంకాలం ప్రయాణ మయ్యాను.

సుగుణా, భానుమూర్తీ, మరి కొందరు మిత్రులూ నన్ను సాగనంపడానికి స్టేషన్‌కి వచ్చారు. రాత్రినుండీ అంతవరకూ నాకు కనిపించీ కనిపించనట్లున్న శాంతమ్మ కూడా వాళ్ళతో కలసి స్టేషన్‌కి రావడం నాకొంత విస్మయం కలిగించింది. స్టేషన్లో మాత్రం ఆమె మామధ్య ఎటువంటి విపరీతం జరగనట్లే - యధాపూర్వకంగానే ప్రవర్తించింది. 'గుడ్డిలో మెల్ల' అనుకుని సగం బరువు దించుకున్నాను నేను.

రైలు బయలుదేరేవేళైంది. ప్లాట్‌ఫారమ్ మీదవున్న ప్రయాణీకులు ఎవరి పెట్టెల్లోకి వారు చేరుకుంటున్నారు. ఆ టూరిస్ట్ ట్రెయిన్ని మానేజ్ చేస్తున్న నా మిత్రుడొచ్చి-'ఇంకా బయటే నిలబడి మాట్లాడ్తున్నావా? అదిగో-గార్డు ఆకుపచ్చజండా ఊపుతున్నాడు, ముందు పెట్టెలోకి ఎక్కి మాట్లాడు బాబూ!' అని హెచ్చరించి వెళ్ళాడు. అంతలోనే గార్డు విజిల్ వేయడం వినిపించింది. నేనిక నా పెట్టెవైపు నడక సాగించాను.

'అరె - ఈ పుస్తకం తీసుకోవడం మరిచే పోయారే!' అంటూ ఒక పుస్తకంతో శాంతమ్మ ఒంటరిగా నన్ను వెంబడించింది. ఆ పుస్తకం నాది కానే కాదు! ఐనా, అందులో ఏదో విశేషం వుండి వుంటుందని, 'థ్యాంక్స్!' అంటూ, అందుకున్నాను. నేను పెట్టెలోకి చేరడం, రైలు బయలుదేరడం ఏకకాలంలో జరిగాయి. ప్లాట్‌ఫామ్ మీదున్న మిత్రులందరికీ 'గుడ్-బై' చెప్పి, వాళ్ళు కనుమరుగు కాగానే- శాంతమ్మ నాకిచ్చిన పుస్తకం పేజీలు త్రిప్పి చూచాను. నేననుమానించినట్లే అందులో ఒకచోట చిన్న చీటీ వుంది! ఆత్రంగా దాన్ని చదువుకున్నాను.

"బాబుగారికి—

అంత భరించలేని పరిస్తితు లెదురైతే ఏ ఆశ్రమంలోనైనా చేరిపోతానే గాని, నేను మళ్ళీ పెళ్ళి మాత్రం చేసుకోలేను. అన్యధా భావించక, క్షమించండి.

—'శాంత'

అని వ్రాసి వుందా చీటీలో... నేనప్రయత్నంగా తొంగి చూచాను. విజయవాడ కను మరుగవుతోంది-కాని, శాంతమ్మ మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది-నాటికీ, నేటికీ!...

పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond 1898 1958 Jubilee
ఆయుర్వేదాశ్రమం(ప్రైవేట్)లిమిటెడ్,
మదరాసు-17.